సాక్షి విజయనగరం

బుధవారం । 7 । మే । 2025



సుర్రుమంటున్న సూరీడు..!

వేసవికాలంలో వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

- 8లో



విద్యల నగరంలో బాలమేధావి

విజయనగరానికి చెందిన 1వ తరగతి చదువుతున్న ఐదేళ్ల బాలుడు గరుగుబెల్లి కునాల్ కష్టసాధ్యమైన జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌ను సులభంగా చెప్పేస్తున్నాడు.

- 8లో



వీఆర్‌ఓ దుర్మరణం

- 8లో

వనిజ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు తమ్ముడు, వీఆర్‌ఓ నిమ్మక విజయానంద్ బైక్‌పై వెళ్తూ ప్రమాదానికిగురై ప్రాణాలు విడిచారు.

న్యూస్‌రీల్

అది 13వ శతాబ్దం నాటి శివలింగం



పురాతన శివలింగంను పరిశీలిస్తున్న పురావస్తుశాఖ ఎ.డి.ఫల్గుణరావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడ అగ్రహారం శ్మశానవాటిక సమీపంలోని శివలింగం, దాని సమీపంలోని వివిధ ఆకృతులు కలిగిన రాతి విగ్రహాలను పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ఫల్గుణరావు మంగళవారం పరిశీలించారు. శివ లింగంకు ఉపయోగించిన రాయి, దాని ఆకృతులును పరిశీలించి, శివలింగం 13వ శతాబ్దం నాటిదిగా పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని 6వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు తూర్పు గాంగులు పాలించారని, ముస్లింల దండయాత్రలో విగ్రహాలు ధ్వంసమయ్యాయన్నారు. గ్రామ సమీపంలో వెయ్యేళ్ల కిందటి మహిసాసుర మర్దిని పాలరాతి విగ్రహం ఉందన్నారు. సర్పంచ్ రఘు మాట్లాడుతూ పురాతన శివ లింగం ఉన్న చోట ఆలయం నిర్మించాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. పురావస్తు సంపదను కాపాడుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు కోట్ల సత్యంనాయుడు, లెంక రామునాయుడు, లెంక రాజినాయుడు, లెంక రామకృష్ణ, చందక అప్పలస్వామి, అప్పలనాయుడు, సీతంనాయుడు పాల్గొన్నారు.

నేలల పరిరక్షణతో పర్యావరణ పరిరక్షణ

- ఇన్‌చార్జి కలెక్టర్ సేతుమాధవన్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: నేలల పరిరక్షణతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, జిల్లాలోని చెరువులు, కాలువలు తదితర జలావాసాలు, చిత్తడి నేలలను పరిరక్షించాలని అధికారులకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా వెట్ ల్యాండ్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా జిల్లాల్లో 2,263 ఎకరాల చిత్తడి నేలలను గుర్తించి, అటవీశాఖ ద్వారా గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేశారని చెప్పారు. చినపతివాడ, చింతపల్లి గ్రామాల్లో గుర్తించిన రెండు సహజకాలువలను చిత్తడి నేలలుగా గుర్తించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. జిల్లా అటవీశాఖాధికారి కొండలరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా జలావాసాలు, చిత్తడి నేలల సంరక్షణకు తీసుకున్న చర్యలను వివరించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



రైతన్నపై కూటమి కినుక



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



బైరెడ్డిపేటలో ఈదురు గాలులకు నేలకొరిగిన అరటి పంటను పరిశీలిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్, నాయకులు

- పంట నష్టాలను పరిశీలించే తీరిక ప్రభుత్వానికి లేదు
- ఉత్తరాంధ్రలో వ్యవసాయ మంత్రి ఉన్నా ప్రయోజనం శూన్యం
- రబీ సీజన్‌లో ఒక్కబస్తా ధాన్యం కొనుగోలు చేయని పరిస్థితి
- సీఎం చంద్రబాబువి ప్రకటనలే తప్ప ఆదేశాలు లేవు..
- జిల్లాలో మంత్రి, ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు
- ధరల స్థిరీకరణ నిధులు ప్రకటనలకే పరిమితం
- గాలివానకు నాశనమైన పంటలను పరిశీలించిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: రైతన్నపై కూటమి ప్రభుత్వం కినుక వహిస్తోంది. సాగు కష్టాలను పట్టించుకోవడం లేదు. విపత్తుల సమయంలో ఆదుకునే పరిస్థితి లేదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించే మార్గం లేక.. కొనుగోలుదారుల కోసం ఎదురుచూడాల్సిన దయనీయమైన పరిస్థితిని రైతన్న ఎదుర్కొంటున్నాడంటూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు బెల్లాన చంద్రశేఖర్ వాపోయారు. ఇటీవల కురిసిన గాలివానకు చీపురుపల్లి మండలంలోని పి.కె.పాలవలస పంచాయతీ పరిధి బైరెడ్డిపేట, మెట్టబడి, కలిశెట్టిబడి తదతర గ్రామాల్లో నేలకూలిన అరటి పంటను మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్ట వివరాలు తెలుసుకున్నారు. ఉద్యాన పంటల నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని మీడియా సాక్షిగా డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

ఉత్తరాంధ్రకు చెందిన వ్యవసాయ మంత్రి ఏం చేస్తున్నారు....

అకాల వర్షాలతో ఉత్తరాంధ్రలో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలకు తీరిక లేకపోవడం విచారకరమన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వ్యక్తి వ్యవసాయ మంత్రిగా ఉన్నా రైతులకు ప్రయోజనం శూన్యంగానే కనిపిస్తోందన్నారు. పంట నష్టాలపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు, క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు ఎలాంటి సంబంధం కనిపించడంలేదన్నారు. ఈదురుగాలలకు నష్టం జరిగిన పంటలను పరిశీలించాలని అధికారులను ఆదేశించినట్టు సీఎం చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో అధికారులకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. రైతులను మోసం చేసేలా ప్రకటనలు ఇవ్వడం దారుణమన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి ఒక్క బస్తా ధాన్యం కొనుగోలు చేయలేదని, కాదని ప్రభుత్వం చెబితే నిరూపించడానికి అధికారులు ఇచ్చిన నివేదికలు తమ వద్ద సిద్ధంగా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు రైతుభరోసా, ఆర్‌బీకేల నుంచి ఎరువులు, విత్తనాలు విరివిగా అందజేసినట్టు గుర్తుచేశారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జిల్లాలో ఒక్క వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడం కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక పాలనకు అద్దంపడుతోందన్నారు. జిల్లాలో మొక్కజొన్న, అపరాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఒక్క గింజకూడా కొనుగోలు చేయలేదని ఆరోపించారు. పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బంది పడేపరిస్థితులను సృష్టించడం దారుణమన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

రైతులను ఆదుకోవడం, మేలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. ఈదురు గాలులకు పెద్ద ఎత్తున ఉద్యాన పంటలు నష్టపోతే కనీసం ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులు సాగుధైర్యం కోల్పోయారన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తేయడంతో రైతులకు ఎలాంటి పంటనష్టపరిహారం మంజూరు కావడంలేదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు తప్ప ప్రజల సంక్షేమం ప్రభుత్వానికి పట్టడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, నియోజకవర్గ వలంటీర్ విభాగం అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ రాజారావు, రఘుమండ త్రినాథ్, ఎంవీఎస్ఎన్ రాజు, రేవల్ల సత్తిబాబు, పిసిని శ్రీను, బైరెడ్డి లక్ష్మణ, రెల్లి శివ, రెల్లి వెంకటేష్, గవిడి సురేష్, రౌతు పైడిరాజు, కర్రోతు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కూలిపోయే దశలో.. కోటిపాం వంతెన



గోతులమయమైన కోటిపాం వంతెన రోడ్డు

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా రాయగడ వెళ్లే అంతర్‌రాష్ట్ర రహదారిఅధ్వానంగా మారింది. పెద్దపెద్ద గోతులతో దర్శనమిస్తోంది. ఈ రోడ్డులో ప్రయాణించేందుకు వాహనచోదకులు భయపడుతున్నారు. ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. మరోవైపు 1933లో జంఝావతి నదిపై కోటిపాం గ్రామ సమీపంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. దీనిపై 10 టన్నుల బరువుగల వాహనాలు రాకపోకలకు అనుమితి ఉండగా, 30 నుంచి 40 టన్నుల లోడుతో వాహనరాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన రోడ్డు గోతులమయం కావడం, వంతెన శిథిలావస్థలో ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఛత్తీస్‌గఢ్, జార్కండ్ రాష్ట్రాల్లోని పరిశ్రమలకు విశాఖపట్నం పోర్టునుంచి ముడిసరుకును తీసుకెళ్లడం, తిరిగి ఉత్పత్తులు తరలించే వాహన రాకపోకలకు ఈ మార్గమే ఆధారం. ఇంతటి ప్రాధాన్యమున్న రోడ్డును బాగుచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దాడితల్లీ.. దయచూపమ్మా..!





సిరిమానోత్సవంలో భక్తజనం, (ఇన్‌సెట్లో) భక్తులకు ఆశీస్సులు అందజేస్తున్న సిరిమాను పూజారి

దాడితల్లి అమ్మవారు



- వైభవంగా సాగిన సిరిమాను సంబరం
- ఉప్పొంగిన భక్తజనం
- రాత్రి 7 గంటల తరువాత ప్రారంభమైన సిరిమాను ఊరేగింపు
- చీకట్లోనే సిరిమానును దర్శించిన భక్తులు

బొబ్బిలి: మేళతాళాలు.. భక్తుల జయజయధ్వానాలు.. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ దాడితల్లి సిరిమానోత్సవం మంగళవారం సంబరంగా సాగింది. సిరిమాను రూపంలో ఊరేగింపుగా వచ్చిన అమ్మవారిని చూసి భక్తులు మురిసిపోయారు. ఆధ్యాత్మిక చింతనతో తరించారు. దాడితల్లీ.. దయచూపమ్మా అంటూ ప్రార్థించారు. పండ్లు, పూలు, చీరెలను సిరిమాను రథంపైకి విసిరి మొక్కుబడులు చెల్లించారు. గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. ప్రధాన ఆలయం, బైపాస్ రోడ్డులోని ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. సాయంత్రం వరకూ అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమలు, కోళ్లు, మేకలను చూపుతూ మొక్కుబడులు చెల్లించారు. సాయంత్రం 4.30 నుంచి 6 గంటల మధ్య సిరిమాను తిరువీధి ప్రారంభం కావాల్సి ఉంది. అయితే, రాత్రి ఏడు గంటలకు సిరిమానుపై పూజారి బత్తిన కృష్ణ ఆసీనులయ్యారు. సంప్రదాయం ప్రకారం గద్దె ఇంటిపై నుంచి సిరిమానును అధిరోహించారు. కత్తి చేత పట్టుకుని భక్తులకు పూజారి ఆశీస్సులందజేశారు. సిరిమాను రథం పైలవీధి నుంచి గొల్లపల్లి కూడలికి వచ్చేసరికి రాత్రి 8 గంటలయింది. చీకటిలోనే సిరిమానును తిలకించారు. సిరిమానోత్సవం ఆలస్యంగా ప్రారంభం కావడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తంచేశారు.

12 గ్రామాల జాతర...

ఏటా దాడితల్లి అమ్మవారి పండగను గొల్లపల్లి, కృష్ణాపురం పరిసరాల్లోని 12 గ్రామాల ప్రజలు జరుపుకుంటారు. ఒకే పండగను అన్ని గ్రామాల ప్రజలు జరుపుకోవడం, దూర ప్రాంతాల్లో నివసించేవారంతా రాకతో గ్రామాలన్నీ సందడిగా మారాయి.

అమ్మవారి సేవలో...



దాడితల్లి అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన), జేసీఎస్ ఇన్‌చార్జిలు రేజేటి ఈశ్వరరావు, తమ్మిరెడ్డి దామోదరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దర్శించుకున్నారు. డీఎస్పీ జి.భవ్యారెడ్డి, సీఐ కె.సతీష్‌కుమార్‌లు 300 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న బళ్ల వేషాలు

గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి పండగ, సిరిమానోత్సవానికి ప్రత్యేకత అయిన బళ్ల వేషాలు ఈ ఏడాదీ ఆకట్టుకున్నాయి.

సిరిమానోత్సవంలో అపశృతి



గాయపడిన జయరాం

దాడితల్లి సిరిమానోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. సిరిమాను ఊరేగుతుండగా రాత్రి 11 గంటల సమయంలో బొబ్బిలి మీగడ వీధికి చెందిన అంటిపేట జయరాం అనే యువకుడు స్నేహితులతో కలిసి వెళ్తూ రథం కింద పడిపోయాడు. తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని బొబ్బిలి సీహెచ్‌సీకి పోలీసులు తరలించారు. కాలు విరిగిపోవడంతో మెరుగైన వైద్యంకోసం జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు.

గరివిడి వేదికగా రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

- ఈ నెల 9, 10, 11 తేదీల్లో పోటీలు
- గరివిడి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ, తెలంగాణా రాష్ట్రాల స్థాయిలో ఆహ్వానపు నాటిక పోటీలు
- గరివిడి శ్రీరాంహైస్కూల్ వేదికగా సాగనున్న పోటీలు
- ఏపీ నుంచి 4, తెలంగాణ నుంచి 4 నాటికల ప్రదర్శన
- హాజరు కానున్న సినీ నటులు సుమన్, తనికెళ్ల భరణి, ఆర్.నారాయణమూర్తి, నరసింహరాజు, కవిత, జయలలిత



నాటిక పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గరివిడి కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు



నాటిక పోటీలకు ముస్తాబవుతున్న గరివిడి శ్రీరాం హైస్కూల్ వేదిక

చీపురుపల్లిరూరల్(గరివిడి):

ఏపీ, తెలంగాణా రాష్ట్రస్థాయి ఆహ్వానపు నాటిక పోటీల ప్రదర్శనకు గరివిడి ముస్తాబైంది. శ్రీరాం హైస్కూల్ మైదానం వేదికగా ఈ నెల 9, 10, 11 తేదీల్లో 8 నాటిక పోటీలు జరగనున్నవి. గరివిడి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 28 ఏళ్ల తరువాత ఇక్కడ నాటిక పోటీల ప్రదర్శన సాగనుంది. గరివిడి పట్టణం కళాకారులకు నిలయం. సాంస్కృతిక ప్రద ర్శనలకు చక్కని వేదిక. ఇక్కడ ఏటా కళా ప్రదర్శనలు జరిగేవి. 1975 సెప్టెంబర్–25 ఫేకర్ ఫౌండేష న్ డే నుంచి 1997 వరకు రెండు దశాబ్దాల కాలం ఏటా సాంస్కృతిక సందడి నెలకునేది. మారుతున్న కాలంతో పాటుగా నేటి సమాజంలో నాటిక, పౌరాణిక నాటకాలకు ఆదరణ తగ్గింది. ఈ తరుణంలో కళలు, కళాకారులను ప్రోత్సహిస్తూ గరివిడి కల్చరల్ అసోసియేషన్ రూ.15లక్షల వ్యయంతో నాటిక పోటీల నిర్వహణకు సన్నద్ధమైంది. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వాకాడ గోపి, ప్రతినిధులు బీఎస్ఎన్ రవి, కంబాల శివ, బాలాజీ పట్నాయక్, ఎం.జగన్నాథరాజు, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, ఉప్పు శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో జరగనున్న నాటిక పోటీలతో మరల గరివిడి ప్రాంతం కళాప్రదర్శనలకు నిలయంగా మారాలని జనం ఆకాంక్షిస్తున్నారు.

ప్రైజ్ మనీ ఇలా..

మూడు రోజుల పాటు 8 నాటిక ప్రదర్శనలు ఉంటాయి. ప్రతి నాటిక ప్రదర్శనకు రూ.25వేలు చొప్పున రూ.2లక్షలు ప్రోత్సాహంగా అందజేస్తారు. నాటిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వరుస మూడు బృందాలకు రూ.15వేలు, రూ.12,500, రూ.10వేలు చొప్పున నగదు బహుమతిని అందజేస్తారు. ఉత్తమ రచనకు రూ.5వేలు, ఉత్తమ దర్శకత్వానికి రూ.5వేలు నగదు బహుమతిని అందజేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. నాటిక పోటీలు తిలకించేందుకు 9న ఆర్.నారాయణమూర్తి, 10న నరసింహరాజు, 11న సుమన్, తనికెళ్లభరణి, కవిత, జయలలిత (బోరింగుపాప) హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

ప్రదర్శించనున్న నాటికలు ఇవే..

- మే 9న హైదరాబాద్‌కు చెందిన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారు 'స్వేచ్ఛ', హైదరాబాద్‌కు చెందిన మిత్ర క్రియేషన్స్ వారు 'ఇది రహదారి కాదు' నాటిక ప్రదర్శనలు ఉంటాయి.
- 10వ తేదీన గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ వారు 'చిగురు మేఘం', హైదరాబాద్‌కు చెందిన కళాంజలి వారు 'రైతే రాజు' నాటికలను ప్రదర్శిస్తారు.
- 11వ తేదీన బోరివంకు చెందిన శర్వాని గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారు 'కొత్త పరిమళం', కరీంనగర్‌కు చెందిన చైతన్య కళాభారతి వారు 'చీకటి పువ్వు', విశాఖపట్నంకు చెందిన సౌజన్య కళాప్రవంతి వారితో 'దేవరాగం' నాటిక ప్రదర్శనలు ఉంటాయి. ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి రాత్రి 11గంటల వరకు నాటిక ప్రదర్శనలు ఉంటాయి. ప్రతి నాటిక ప్రదర్శనకు గంట సమయాన్ని కేటాయిస్తున్నారు.

క్షయ నిర్ధారణే లక్ష్యంగా..

- టీబీ రోగులతో కాంటాక్ట్ అయిన వారికి సీవైటీబీ పరీక్షలు
- హెల్త్ కేర్ వర్కర్స్‌కు కూడా సీవైటీబీ పరీక్ష
- ఇప్పటి వరకు 819 మందికి పరీక్ష చేయగా 19 మందికి పాజిటివ్
- 2024–25లో 3,200 కేసుల నమోదు



సర్వజన ఆస్పత్రిలో హెల్త్‌కేర్ వర్కర్‌కు సీవైటీబీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్:

టీబీ (క్షయ) వ్యాధిని గుర్తించేందుకు క్షయ నివారణ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. క్షయవ్యాధి ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతుంది. క్షయ రోగులను త్వరగా గుర్తించి వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు వ్యాధి నిర్ధారణ పరీక్షలను ముమ్మరం చేశారు. రోగులతో కాంటాక్టు అయినవారందరికీ సీవైటీబీ పరీక్ష చేస్తున్నారు. ఛాతిఎక్స్‌రే, కఫం పరీక్ష చేసి వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. వ్యాధి సోకిన వారికి అవసరమైన మందులను ఆరు నెలల పాటు ఉచితంగా అందజేస్తారు.

• 819 మందికి పరీక్ష

జిల్లా వ్యాప్తంగా క్షయ రోగులతో కాంటాక్ట్ అయిన 819 మందికి సీవైటీబీ పరీక్ష (చర్మంపై చేసే సూది పరీక్ష) చేశారు. ఇందులో 19 మందికి పాజిటివ్ వచ్చింది. వీరికి కఫం పరీక్షతో పాటు, ఛాతిఎక్స్‌రే తీస్తారు. క్షయ రోగులతో కాంటాక్ట్ అయిన వారితో పాటు ఆయా రోగులకు సేవలందించే హెల్త్‌కేర్ వర్కర్స్‌కు సైతం సీవైటీబీ పరీక్షలు చేస్తున్నారు.

• 2024–25లో 3,200 కేసుల నమోదు

2024–25లో జిల్లాలో 3,200 క్షయ వ్యాధి కేసులు నమోదయ్యాయి. 2025 జనవరి నుంచి ఏప్రిల్ వరకు 160 కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, యూపీహెచ్‌సీల్లో క్షయనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.



పట్టణ యూపీహెచ్‌సీలో సీవైటీడీ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

సీవైటీబీ పరీక్ష చేస్తున్నాం

క్షయ వ్యాధి వ్యాప్తి తగ్గించాలనే ఉద్దేశంతో క్షయ రోగులతో కాంటాక్ట్ అయిన రోగులకు సీవైటీబీ పరీక్షలు చేస్తున్నాం. హెల్త్ కేర్ వర్కర్‌లకు కూడా సీవైటీబీ పరీక్ష చేస్తున్నాం. దీనివల్ల ఎవరికి క్షయ వ్యాధి ఉన్నా తెలుసుకునేందుకు, నివారణకు అవకాశం ఉంటుంది.

– డాక్టర్ కె.రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి

అప్రమత్తతే ప్రధానం

క్షయరోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు ఉమ్మితుంపర్లు ద్వారా ఒకరి నుంచి మరొకరికి ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. అందువల్ల క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి. బహిరంగ ప్రదేశాలు, జనసమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లినప్పుడు మాస్క్ ధరించడం మంచిది. మాస్క్‌లేకుంటే రుమాలు అయినా నోటికి అడ్డంగా పెట్టుకోవాలి. దీనివల్ల క్షయ రోగి దగ్గినా, తుమ్మినా రక్షణగా ఉంటుంది.

క్లుప్తంగా

ఆటోబోల్తా: పలువురికి గాయాలు



క్షతగాత్రులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్సై బి.సంతోషి

పార్వతీపురం రూరల్: మండలంలోని పెదమ రికి గ్రామం నుంచి కారాడవలస గ్రామానికి దినసరి కూలీలతో వెళ్తున్న ఆటో కృష్ణపల్లి గ్రామ శివారు ప్రాంతంలో మలుపు వద్ద అదుపుతప్పి పంట పొలాల్లోకి వెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు కాగా ఓ యువకుడి కాలికి తీవ్రగాయమైంది. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి 108 వాహనం చేరుకుని క్షతగాత్రులను పార్వతీపురం కేంద్రాస్పత్రికి తరలించింది. గాయాల పాలైన వారిని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



హరీష్ మృతదేహం

గంట్యాడ: గజపతినగరం మండలం ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన వసాత హరీష్ (30) గంట్యాడ మండలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం మండలంలోని వైఎస్సార్‌నగర్‌లో ఉంటూ అరకులో బీఎస్ఎన్ఎల్ టవర్‌లో హరీష్ పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అధిక మొత్తంలో అప్పులు చేవాడు. అవితీర్చలేనేమోనన్న బెంగతో గంట్యాడ మండలం కొండతామరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న తోటలోకి వెళ్లి సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో గడ్డిమందు తాగేశాడు. పరిస్థితి విషమంగా మారడంతో భార్యకు ఫోన్ చేయగా కుటుంబసభ్యులు చేరుకుని విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 8:20 గంటలకు మృతిచెందాడు. హరీష్‌కు ఏడాది క్రితం వివాహమైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

సుర్రుమంటున్న సూరీడు..!

- విలవిల్లాడుతున్న వన్యప్రాణులు
- వేసవిలో ఇబ్బందుల్లేకుండా అటవీశాఖ చర్యలు
- అభయారణ్యంలో పుష్కలంగా నీటివసతులు
- జంతువుల కోసం నీటికుంటలు, చెక్‌డ్యామ్‌లు, చెలమలు
- తాగునీటి కోసం గ్రామాలకు రాకుండా అడవిలోనే ఏర్పాట్లు



విజయనగరం పూల్‌బాగ్ ఫారెస్ట్‌లోని సాసర్‌పిట్లో నీరు తాగుతున్న కోతి



పూల్‌బాగ్ ఫారెస్ట్‌లో పక్షుల దప్పిక తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటికుంటలు



పూల్‌బాగ్ కాలనీలో సాసర్‌పిట్‌లో ట్యాంకర్‌తో నీరు నింపుతున్న అటవీశాఖ సిబ్బంది

వన సంపదపై ప్రజలకు అవగాహన



వేటగాళ్ల నుంచి వన్యప్రాణులను కాపాడుకునేందుకు సమీప అటవీ గ్రామాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. 'వన్యప్రాణుల చట్టం -1972' గురించి వివరిస్తున్నాం. వన్యప్రాణులను చంపితే ఎలాంటి శిక్షలు ఉంటాయో తెలియజేస్తున్నాం. అలాగే అటవీ సిబ్బందితో ప్రతినిత్యం పెట్రోలింగ్ చేస్తున్నాం. పటిష్ట చర్యలు చేపట్టడంతో వన్యప్రాణులను కాపాడుకోగలుగుతున్నాం. వన్యప్రాణులు తాగునీటికి ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వన్యప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యత. ప్రభుత్వం కూడా వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోంది. వేసవిలో వన్యప్రాణుల దాహం తీర్చడానికి అటవీశాఖ ద్వారా చేపట్టే చర్యలు చాలా అవసరం. అయితే వన్యప్రాణులు మైదాన ప్రాంతాలకు వస్తున్నప్పుడు వేటగాళ్ల బారిన పడుతున్నాయి. కాబట్టి, అటవీశాఖతో పాటు ప్రజలు కూడా వన్యప్రాణులను కాపాడడానికి సహకరించాలి. దాహం కోసం జంతువులు అడవిని వీడి నీటి జాడలు వెతుక్కుంటూ గ్రామాల్లోకి వస్తుంటాయి. ప్రజలు వాటికి హాని తలపెడితే శిక్షార్హులవుతారు. – విజయనగరం జిల్లా అటవీశాఖ అధికారి ఆర్.కొండలరావు

విజయనగరం గంటస్తంభం: ఒకప్పుడు వేసవికాలం మొదలైందంటే అడవిలో జలవనరులన్నీ ఎండిపోయి తాగేందుకు నీరు లేక వన్యప్రాణులు అల్లాడేవి. నీళ్లు తాగేందుకు కొన్ని జంతువులు నదుల దారిపడితే..మరికొన్ని సమీప గ్రామాల వైపు వెళ్లేవి. ఇదే అదునుగా మాటువేసి ఉన్న వేటగాళ్ల ఉచ్చులు, విద్యుత్ కంచెలకు బలయ్యేవి. ఏటా అడవి ప్రాణుల మనుగడ కష్టంగా మారిన నేపథ్యంలో అటవీ శాఖ అడవుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ మేరకు విజయనగరం జిల్లాలో సుమారు 17,300 హెక్టార్లలో విస్తరించి ఉన్న అభయారణ్యంలో తగినన్ని నీటి వసతులు కల్పించింది. ఎండాకాలంలో వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అడవి లోపలే చెక్‌డ్యాములు, సాసర్‌పిట్‌లు,చెలమలతో పాటు మినీ,మేజర్ సర్క్యులేషన్ పార్కులు, రాతికట్టడాలు నిర్మించి దప్పిక తీర్చుతోంది. ఇలా అటవీశాఖ చర్యలతో తొమ్మిదేళ్లలో అడవంతా పచ్చబడి దట్టంగా మారి వన్యప్రాణుల సంఖ్య కూడా పెరుగుతోంది.

పెరుగుతున్న అటవీ సంపద

అభయారణ్యం విజయనగరం జిల్లా పరిధిలో 173 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. తొమ్మిదేళ్లుగా చేపడుతున్న చర్యలతో అభయారణ్యం దట్టమైన అడవులకు నిలయంగా మారింది. దీంతో ఏటా వన్యసంపద పెరుగుతోంది. ఇక్కడ అత్యధికంగా అడవి పందులు, ఎనుబోతులతో పాటు ఎలుగుబంట్లు, జింకలు, దుప్పలు సంచరిస్తున్నాయి. వాటితో పాటు కోతులు, కొంగలతో పాటు వివిధ రకాలైన పక్షులు ఉన్నాయి. గతంలో ఈ అభయారణ్యంలో వేసవికాలం వచ్చిందంటే నీటి వనరులన్నీ ఎండిపోయేవి. దీంతో వన్యప్రాణులు నదులలో నీటిని తాగేందుకు వచ్చేవి.

విజయనగరం అటవీ విభాగం ఏర్పరిచిన నీటికుంటల వివరాలు..

2021-22 లో రిజర్వ్ అడవిలో నిర్మించిన నీటికుంటలు		
సంఖ్య	ప్రదేశం/రిజర్వ్ అడవి	విస్తీర్ణం (కి.మీ)
1	వెదురువాడ-1	3
2025-26 లో రిజర్వ్ అడవిలో నిర్మించేందుకు ప్రతిపాదించిన నీటికుంటల వివరాలు		
వ.సంఖ్య	ప్రదేశం / రిజర్వ్ అడవి	విస్తీర్ణం (కి.మీ.)
1	బొబ్బిలి	3
2	మారిక	2
3	దమరసింగి	2
4	వెలగాడ	1
5	షికారుగంజి	2
నీటికుంటలు మొత్తం		10

9,500 లీటర్ల బెల్లంఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న టబ్బులను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): నవోదయం 2.0లో భాగంగా మంగళవారం ఒడిశా సిబ్బందితో కలిసి రాయగడ జిల్లాలోని కెరడ, వనజ, సుళవ గ్రామాల పరిధిలో నిర్వహిస్తున్న సారా బట్టీలపై దాడి చేసి 45 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 9,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఈ దాడిలో 460 లీటర్ల సారాను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో విజయనగరం ఈఎస్ఐఎఫ్ సీఐ రామచంద్రకుమార్, సీతానగరం ఎక్సైజ్ సీఐ పద్మావతి తదితరులు పాల్గొన్నారని తెలియజేశారు.

విద్యల నగరంలో బాలమేధావి



బాలమేధావి కునాల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: సాధారణంగా చిన్నపిల్లలు వీడియో గేమ్స్ లేదా కంప్యూటర్ గేమ్స్‌తో కాలం గడుపుతారు. కానీ విజయనగరానికి చెందిన 1వ తరగతి చదువుతున్న ఐదేళ్ల బాలుడు గరుగుబెల్లి కునాల్ కష్టసాధ్యమైన జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ సులభంగా చెప్పేస్తున్నాడు. ది వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఫస్ట్ స్టాండర్డ్ చదువుతున్న కునాల్ 140కు పైగా దేశాలకు సంబంధించిన జాతీయ పతాకాలను అవలీలగా గుర్తుపట్టడమే గాక, వందకు పైగా దేశాలకు సంబంధించిన సమాచారాన్ని, వివిధ సముద్రాలు, వివిధ ఖండాలు, చారిత్రాత్మక యుద్ధాలు, ప్రదేశాలు, రాజధానులు తదితర అంశాలను అడిగిన వెంటనే చెప్పి అబ్బురపరిచాడు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం గురజాడ స్మారక గ్రంథాలయంలో బాలమేధావి కునాల్ ప్రదర్శన విజయవంతంగా ఇచ్చాడు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీతో కలిసి ఏపీ గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ బాలమేధావికి పతకాన్ని, బహుమతిని అందించి అభినందించారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ముళ్లపూడి సుభద్రాదేవి, గిరిజా ప్రసన్న, ఎం.చంద్రశేఖర్, బాలమేధావి తల్లిదండ్రులు అశోక్, రాజులమ్మ పాల్గొన్నారు.

జాతీయ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం: ది గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. నగరంలోని విజ్జి స్టేడియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 20 మంది జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విజయనగరం జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభ గల క్రీడాకారులకు విజయనగరం పెట్టింది పేరుగా వాఖ్యానించారు. ఎంతోమంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి విజయనగరం కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ది గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు రాధిక మంగిపూడి, ప్రధాన కార్యదర్శి సూర్యలక్ష్మి, ఉపాధ్యక్షులు కేఆర్‌కే రాజు, సహాయ కార్యదర్శి హరిగోపాల్, కోశాధికారి రవికుమార్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు పి.లీలాకృష్ణ, జి.శ్రీకాంత్, వి.ఆనంద కిశోర్, పి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి చీరల్లో వెరైటీ చూపించాలి

- చేనేత జౌళిశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్



నారాయణపురంలో చేనేత కార్మికులకు సూచనలు ఇస్తున్న అధికారి

బలిజిపేట: చేనేత రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నట్లు చేనేత జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్ చెప్పారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని నారాయణపురంలో చేనేత కార్మికుల స్థితిగతులను మంగళవారం ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి కొన్ని సూచనలు చేస్తూ బొబ్బిలి చీరలకు వెరైటీ కల్పించాలని సూచించారు. మహిళలు ఎక్కువగా ఇష్టపడే బుటా చీరలను తయారుచేసేందుకు ప్రయత్నించాలని కోరారు. రకరకాల చీరలను తయారుచేసేందుకు అవసరమైన సహాయసహకారాలు అందించనున్నట్లు చెప్పారు. చీరలు తయారుచేసేందుకు అవసరమైన మెటీరియల్ ఏమిటి? ఎక్కడ నుంచి వస్తుంది? ఇంకా ఎటువంటి మెటీరియల్ అవసరం, నైపుణ్యాలను పెంచాలంటే ఎటువంటి చర్యలు చేపట్టాలి? చేనేత రంగాభివృద్ధికి శాఖా పరమైన సహాయసహకారాలు ఎంతమేర అవసరం అనే విషయాలపై వారితో చర్చించి వారినుంచి అభిప్రాయాలను తెలుసుకున్నారు. మంచి నాణ్యమైన సరుకులు తయారుచేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, శ్రీకాకుళం ఎ.డి జనార్దన రావు, అసిస్టెంట్ డివిజనల్ అధికారి రమణ, చేనేత కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ మే డే వారోత్సవాల్లో భాగంగా విజయనగరంలోని కార్మికశాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికశాఖలో అమలవుతున్న కేంద్రప్రభుత్వ పథకాల గురించి సవివరంగా తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఎంతమంది కార్మికులు లబ్ధి పొందారో ఆరాతీశారు. అనంతరం కార్మిక శాఖ భవనం ఆవరణలో అసంఘటిత కార్మికులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ అసంఘటిత కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో వేతన సవరణ చట్టం, హక్కులు, బాధ్యతల గురించి తెలియజేశారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1 5 1 0 0కు ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎ.శ్రీనివాస్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ నామినేటెడ్ సభ్యుడు జి.తిరుపతి పాల్గొన్నారు.

వీఆర్‌ఓ దుర్మరణం

- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



దెబ్బతగిలిన గొర్లి సురేష్



బైక్‌లో ఇరుక్కుని మృతిచెందిన విజయానంద్

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని వనిజ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు తమ్ముడు, వీఆర్‌ఓ నిమ్మక విజయానంద్ బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై ప్రాణాలు విడిచారు. వివరాల్లోకి వెళ్తే.. వీరఘట్టం మండలం కత్తులకవిటి వీఆర్‌ఓగా పనిచేస్తున్న విజయానంద్ స్వస్థలం వనిజ గ్రామం. కొంతకాలంగా పార్వతీపురంలో నివాసం ఉంటూ అక్కడి నుంచి ఉద్యోగానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సోమవారం వనిజ గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లి రాత్రి అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం 6.45 గంటల సమయంలో పల్సర్ బైక్‌పై బయలుదేరారు. తురక నాయుడు వలస-ఇటుక గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారిపై తురక నాయుడు వలస గ్రామానికి చెందిన గొర్లి సురేష్ వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా వెనుక నుంచి విజయానంద్ బైక్‌తో ఢీకొట్టాడు. ప్రమాదంలో పల్సర్ బైక్ హ్యాండిల్‌బార్‌లో విజయానంద్ తల ఇరుక్కుపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనపై సురేష్ తన తమ్ముడికి ఫోన్ చేసి తెలియజేయడంతో తురక నాయుడు వలస నుంచి గ్రామస్తులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని జియ్యమ్మవలస పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఎస్.ప్రశాంత్ కుమార్ సిబ్బందితో వచ్చి ఘటనపై ఆరా తీశారు. సురేష్‌ను 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించి విజయానంద్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడు విజయానంద్‌కు ఇద్దరు భార్యలు భారతి, సునీత, ముగ్గురు కుమార్తెలతో పాటు పోషిత్ అనే కుమారుడు ఉన్నాడు.

దర్యాప్తులో ఫోరెన్సిక్ ఆధారాలు ముఖ్యం

- మిమ్స్‌లో ఒకరోజు శిక్షణ



మిమ్స్‌లో జరిగిన శిక్షణలో సూచనలు ఇస్తున్న ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణులు

విజయనగరం క్రైమ్: కేసుల దర్యాప్తులోను, నిందితులపై నమోదైన కేసుల్లో ఫోరెన్సిక్ ఆధారాలు చాలా ముఖ్యమని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు దర్యాప్తు అధికారరలకు మంగళవారం మిమ్స్‌లో ఫోరెన్సిక్ నిపుణులతో ఒక్కరోజు శిక్షణ జరిగింది. ఈ శిక్షణలో ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణులు ప్రియాంక, సుమాలిక, ప్రశాంతిలు దర్యాప్తు అదికారులకు ఆధారాలు సేకరించడంలో మెలకువలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ నేర స్థలం నుంచి ఆధారాలు సేకరించడంలో దర్యాప్తు అధికారులు సీరియస్‌గానే దృష్టి పెట్టాలని సూచించారు. శాస్త్రీయ పద్ధతులలో ఆధారాలు సేకరించడం, లేబిలింగ్ చేయడం కోర్టులో నిరూపించడం అత్యంత కీలకమని ఎస్పీ అన్నారు. ఆధారాలు సేకరించడంలో సిరాలజీ, ఫోరెన్సిక్ ఫిజిక్స్, డీఎన్ఏ, టాక్సికాలజీ, నార్కోటిక్, సైబర్, ఆడియో, వీడియో పరీక్షలకు పంపడంలో మెలకువలను ఫోరెన్సిక్ అధికారులు, దర్యాప్తు సిబ్బందికి తెలియజేశారు. నేరస్థలం నుంచి వేలిముద్రలు సేకరించడం, మత్తు పదార్థాలు, మానవ అవయవాలు, విష పదార్థాలు, రక్త నమూనాలు, సెమన్, వెంట్రుకలు, ఉమ్ము, పాదముద్రలు, మెమరీ కార్డ్స్, సిమ్‌కార్డ్స్ వంటివి ఎలా సేకరించాలో? ఏవిధంగా భద్రపరచాలో ఫోరెన్సిక్ నిపుణులు ఈ ఒకరోజు శిక్షణలో దర్యాప్తు అధికారులకు తెలియజేశారు. అనంతరం నిపుణులను ఎస్పీ వకుల్ జిందల్ జ్ఞాపికలతో సత్కరించారు.

పైడితల్లికి పుష్పాలంకరణ



ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

దొంగ దొరికాడు

రాజాం సిటీ: చిన్నతనం నుంచే చెడు వ్యసనాలకు బానిసై ఒంటరి మహిళలే టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి పోలీసులకు చిక్కి చివరికి కటకటాలపాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై వై.రవికిరణ్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణాజిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామానికి చెందిన గరికి సుబ్బరాజు చిన్నతనం నుంచే దొంగతనాలకు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 23న రాజాంలోని బాబానగర్ రెండో లైన్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు మోటార్ సైకిల్‌పై వచ్చి ఇంటి గేటు వద్ద ఒంటరిగా ఉన్న పేర్ల లక్ష్మి మెడలో రెండు తులాల పుస్తెలతాడు అపహరించుకుపోయాడు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో కేసు నమోదుచేశారు. మంగళవారం స్థానిక బొబ్బిలి రోడ్డులోని నవ్యనగర్ వద్ద అనుమానాస్పదంగా నిందితుడు సంచరిస్తుండగా అందిన సమాచారం మేరకు పోలీసులు నిందితుడిని పట్టుకుని అరెస్టు చేశారు. చైన్‌స్నాచింగ్, బండ్ల దొంగతనాలు పదేళ్ల వ్యవధిలో 20 వరకు చేశాడని, సుబ్బరాజుపై తిరుపతి, కృష్ణ, రాజమండి, రాజాం తదితర ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయని ఎస్సై వెల్లడించారు. ఈ మేరకు కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని మేదరవీధి జంక్షన్ సమీపంలో ఉన్న లక్కీ రెడీమేడ్ వస్త్ర దుకాణంలో మంగళవారం వేకువజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. మొదటి అంతస్తు వరకు ఉన్న ఈ వస్త్ర దుకాణంలో కింద అంతస్తు పూర్తిగా దగ్ధమవగా మొదటి అంతస్తు పాక్షికంగా ప్రమాదానికి గురైంది. ప్రమాద సమాచారం మేరకు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదానికి సంబంధించి జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనుబాబు మాట్లాడుతూ ముందుగా ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేసి చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా అదుపుచేశామన్నారు. అగ్నిప్రమాదంలో జరిగిన ఆస్తినష్టాన్ని వస్త్ర దుకాణ యజమాని నుంచి బిల్లులను పరిశీలించి అంచనా వేయనున్నట్లు ఆయన తెలిపారు.